సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం । 31 । మార్చి । 2025



అంబారీపై స్వామి దర్శనం

వేములవాడ: వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి స్వామి వారి ఉత్సవమూర్తులను అంబారీపై పురవీధుల్లో ఊరేగించారు.



మండే ఎండ..గొడుగే అండ

గంభీరావుపేట(సిరిసిల్ల): ఎండలు మండిపోతుండడంతో గంభీరావుపేట మార్కెట్‌లో నీడకరువైంది. దీంతో వ్యాపారులు భారీ గొడుగులు ఏర్పాటు చేసుకున్నారు.

గరిష్టం/కనిష్టం
37.0/24.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వేగంగా వీస్తాయి.

బురుజు.. రుజువు



సిరిసిల్ల: బురుజు.. అవును ఇది గతానికి రుజువు. తెలంగాణ పల్లెల్లో ఈ ఎత్తయిన రాతి బురుజులు కనిపిస్తుంటాయి. గత పాలకుల పాలనకు చిహ్నంగా నిలుస్తున్నాయి. అప్పటి పాలకులు తమ ఆధీనంలోని ప్రాంతానికి రక్షణ వ్యవస్థలో భాగంగా వీటిని నిర్మించారు. దీనిపై సెంట్రీగార్డు విధులు నిర్వర్తించేవాడు. శత్రువులను గమనిస్తూ.. వారి దాడిని తిప్పికొట్టేందుకు ఈ బురుజులు నిర్మించారని చరిత్ర చెబుతోంది. అయితే కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలోని బురుజుకు కొత్త శోభ తీసుకొచ్చారు. జాతీయజెండా రంగులు వేసి, మధ్యలో అశోక చక్రాన్ని ఆవిష్కరించారు. నేటితరంలో జాతీయభావాన్ని పెంపొందించేందుకే బురుజుపై జాతీయ జెండా రంగులు వేయించారు. ఊరి నడిబొడ్డులో నిలబడ్డ బురుజు.. జాతీయజెండా రంగులను అద్దుకొని తన ఠీవీని ప్రదర్శిస్తోంది.



విద్యానగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో..



రాజన్న సన్నిధిలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకులు చంద్రగిరి శరత్‌శర్మ, ఇతర అర్చకులు



మార్కండేయ దేవాలయంలో హాజరైన సిరిసిల్ల పట్టణ ప్రముఖులు

శుభప్రదం విశ్వావసు

- భక్తిశ్రద్ధలతో ఉగాది సంబురాలు
- ఆలయాల్లో పచ్చడి వితరణ, పంచాంగ పఠనం

వేములవాడ/సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్: తెలుగు నవవత్సరం శ్రీ విశ్వావసులో ప్రజలు సుఖసంతోషాలతో విరాజిల్లుతారని సిద్ధాంతులు, పంచాంగకర్తలు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఉగాది పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ఆలయాల్లో పూజలు చేశారు. సాయంత్రం పంచాంగ శ్రవణానికి హాజరయ్యారు. వేములవాడ రాజన్న ఆలయంలోని ఓపెన్‌స్లాబ్‌లో ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రగిరి శరత్‌శర్మ ఆధ్వర్యంలో పంచాంగ పఠనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ పండితులను సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని రాజన్నను కోరుకున్నారు. అంతకుముందు స్వామి వారిని దర్శించుకున్నారు. సిరిసిల్ల వెంకన్న క్షేత్రం, మార్కండేయ ఆలయం, శివసాయిబాబా, వాసవీ కన్యకాపరమేశ్వరీ, బీవైనగర్ భక్తాంజనేయ, విద్యానగర్ అభయాంజనేయస్వామి, నెహ్రూనగర్ హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పండితులతో పంచాంగ శ్రవణ కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణ ప్రముఖులు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.



రాజన్న దర్శనం చేసుకుంటున్న విప్ ఆది శ్రీనివాస్

ఉచితం అంటూనే వసూలు

- ఒక్కొక్కరికి రూ.వేయి
- కనీస సౌకర్యాలు కరువు
- సిరిసిల్ల 'సెరాలైఫ్'కు క్యూ కడుతున్న వృద్ధులు
- డిగ్రీ చేసిన యువకుడే వైద్యుడు



సిరిసిల్ల పెద్ద బజారులో రోడ్డుపైనే ఉదయం 7.30 గంటలకే సెరాలైఫ్‌లో పరీక్షలకు వృద్ధుల క్యూలైన్

- సమయం: ఉదయం 7.30 గంటలు
- స్థలం: సిరిసిల్ల పెద్దబజారు.. హన్మాండ్ల గుడి వద్ద
- అంశం: 'సెరాలైఫ్' సంస్థ ఆక్యుప్రెషర్ వైద్యం
- ప్రత్యేకత: వైద్యవిద్యలో ఎలాంటి డిగ్రీ లేకున్నా.. పది మంచాలు వేసి వైద్యసేవలు
- విశేషం: ఉచిత చికిత్స అంటూ ప్రచారం.. ఒక్కొక్కరి వద్ద రూ.వేయి వసూలు
- కొసమెరుపు : ఆరోగ్యం.. ప్రేమ.. సేవ అంటూ కరపత్రాలు.. అనారోగ్య సమస్యలతో వచ్చిన వారికి కూర్చోను కుర్చీలు లేవు.. నిల్చోను నీడ లేదు.

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో వృద్ధులు, ఒళ్లునొప్పులతో బాధపడే వారు టార్గెట్‌గా శాస్త్రీయత లేని వైద్య సేవలు అందిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం అంటూ ప్రచారం చేస్తూ 'సెరాలైఫ్' సంస్థ పది బెడ్లు వేసి ఓ ఇంటిలో వైద్యం చేస్తోంది. కర్ణాటకకు చెందిన డిగ్రీ చదివిన యువకుడు ఇక్కడ సెంటర్ నిర్వహిస్తున్నాడు. ఒక్క చికిత్సతో ఐదు రకాల ప్రభావాలు అంటూ ప్రచారం చేస్తున్నారు. ఆక్యుప్రెషర్ పరికరాలను పదింటిని ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నారు. 'సెరాలైఫ్' ప్రచారంతో జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వందలాది మంది వృద్ధులు, మహిళలు నిత్యం ఉదయం 6 గంటల నుంచే జిల్లా కేంద్రంలోని పెద్ద బజారుకు చేరుకుంటున్నారు. రోడ్డుపైనే క్యూ కడుతున్నారు. అక్కడికి వచ్చిన వారికి కనీసం తాగునీటి వసతి, మరుగుదొడ్లు లేవు. క్యూ పద్ధతిలో చూపించేందుకు వచ్చిన వారి చేతులపైనే నంబరు రాయడం గమనార్హం.

అన్ని నొప్పులకు ఒక్కటే చికిత్స !

వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పులు, రక్తపోటు(బీపీ), మధుమేహం (షుగర్), ఆస్తమా, స్ట్రోక్, మైగ్రేన్, అధిక వెన్నునొప్పి, చెవి, ముక్కు, గొంతు, థైరాయిడ్, రుమటిజం, హెర్నియా వంటి పలు రకాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుందని ప్రచారం చేస్తున్నారు.

ఉచితం పేరిట రూ.వేయి వసూలు

ఉచిత వైద్యం అంటూనే ఒక్కొక్కరి వద్ద రూ.వేయి వసూలు చేస్తున్నారు. రూ.వేయి తీసుకుని ఓ కార్డు ఇస్తూ మూడు నెలల వరకు ఉచిత వైద్యం చేస్తామని చెబుతున్నారు. ఒక్కొక్కరికి రోజుకు రూ.10 వసూలు చేస్తున్నామని చెబుతూ.. వందలాది మందిని సభ్యులుగా చేర్పించారు. ఇప్పటికే సిరిసిల్ల 'సెరాలైఫ్'లో 300 మంది రూ.వేయి చొప్పున చెల్లించారు. అంటే రూ.3లక్షల వరకు ఇప్పటికే వసూలుకాగా.. ఇంకా కొత్త సభ్యులు చేరుతూనే ఉన్నారు. 'సెరాలైఫ్' సెంటర్‌కు వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల నుంచి అనుమతి లేకపోవడం గమనార్హం. ఆక్యుప్రెషర్ పేరిట బెడ్స్ వేసి అందిస్తున్న వైద్యసేవల ఫొటోలు తీసేందుకు 'సాక్షి' ప్రయత్నిస్తే నిర్వాహకులు నియంత్రించారు. సిరిసిల్లలో సాగుతున్న ఆక్యుప్రెషర్ వైద్యంపై జిల్లా అధికారులు దృష్టిసారించి వాస్తవికతను బహిరంగ పరచాల్సిన అవసరం ఉంది.

కార్డుకే రూ.వేయి తీసుకుంటున్నాం



'సెరాలైఫ్' సెంటర్‌కు వచ్చే వారికి కార్డు ఇచ్చి రూ.వేయి తీసుకుంటున్నాం. ఈ కార్డు మూడు నెలల వరకు పనిచేస్తుంది. కామారెడ్డి, హైదరాబాద్‌లోనూ మా సెంటర్లు ఉన్నాయి. ఉచిత బస్సు కావడంతో చాలా మంది వృద్ధ మహిళలు పొద్దున్నే వచ్చి రోడ్డుపై కూర్చుంటున్నారు. మా సెంటర్‌లో ఇంతకంటే వసతి కల్పించే పరిస్థితి లేదు.

– కృష్ణ, సెరాలైఫ్ నిర్వాహకుడు, సిరిసిల్ల

భూములు బీళ్లుగానే..

- గిరివికాసంపై అవగాహన కరువు
- ప్రచారం చేయని అధికారులు
- పథకం గురించి తెలియక నష్టపోతున్న గిరిజనులు
- జిల్లాలో ఇప్పటి వరకు 7 యూనిట్లే మంజూరు
- ఇందులోనూ ఇద్దరి బిల్లులు పెండింగ్



వీర్నపల్లి మండలం శాంతినగర్ పరిధిలో గిరిజనులు చదునుచేసిన భూమి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గిరివికాసం క్షేత్రస్థాయిలో సరిగా అమలుకావడం లేదు. 2018లో ప్రవేశపెట్టిన ఈ పథకంలో ఇప్పటి వరకు ఏడు యూనిట్లు మాత్రమే మంజూరుకావడం దీనికి నిదర్శనం. జిల్లాలో గిరివికాసం పథకం అమలుతీరుపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

పథకం అమలు ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం 2018లో ముఖ్యమంత్రి గిరివికాసం(సీఎంజీవీ) పథకాన్ని ప్రవేశపెట్టింది. గిరిజనుల భూములను సాగులోకి తేవడం ఈ పథకం లక్ష్యం. ఇందులో భాగంగా ఇద్దరు ఆపైన గిరిజన రైతులు కలిసి ఒక గ్రూప్‌గా ఏర్పడితే ఐదు ఎకరాలు ఆపైన భూములకు ఒక యూనిట్‌గా తీసుకుంటారు. ఆ భూములను సాగులోకి తేవడానికి ఉచితంగా బోరుబావి తవ్వించడం, మోటార్ బిగించడం, విద్యుత్ కనెక్షన్ ఇప్పించడం ఈ పథకం ఉద్దేశం. ఈ పథకం కోసం డీఆర్డీఏ ఆఫీస్‌లో రైతులు దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తును వారు స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి సర్వే కోసం పంపిస్తారు. మండల కమిటీలోని అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి అర్హులా.. కాదా.. అని నిర్ణయిస్తే అప్పుడు యూనిట్ మంజూరవుతుంది.

ఏడేళ్లలో ఏడు యూనిట్లే !

ముఖ్యమంత్రి గిరివికాసం పథకాన్ని ప్రవేశపెట్టి ఏడేళ్లు గడుస్తుండగా ఏడు యూనిట్లు మాత్రమే మంజూరయ్యాయి. ఇందులో ఇంకా ఇద్దరికి బిల్లులు మంజూరు కావాల్సి ఉంది. పథకం గురించి క్షేత్రస్థాయిలో గిరిజనులకు అవగాహన లేకపోవడంతో దరఖాస్తులు చేసుకోవడం లేదు. గిరిజనశాఖ అధికారులు తండాల్లో ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో వారి కోసం ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి తెలియడం లేదు. పథకం ఉన్నట్లు తెలిసినా ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఏయే ఆఫీస్‌లలో కలవాలి.. అనే విషయాలు తెలియక గిరిజనులు లబ్ధి పొందలేకపోతున్నారు. ఫలితంగా గిరిజనుల భూములు బీళ్లుగానే మిగిలిపోతున్నాయి.

అవగాహన కల్పించాలి



గిరివికాసం పథకం గురించి గిరిజనులకు పూర్తి వివరాలు తెలియదు. అధికారులు ఎవరూ గిరిజనుల పల్లెల్లో అవగాహన కల్పించడం లేదు. దీంతో అర్హులైన వారు పథకానికి దూరమవుతున్నారు. గిరిజనశాఖ అధికారులైన అవగాహన కార్యక్రమాలు పెట్టి మా కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించాలి.

– రాజునాయక్, బంజార సంఘం జిల్లా నాయకుడు

పథకం గురించి తెలియదు



మా భూముల్లో గవర్నమెంట్ బోర్లు వేయిస్తుందనే సంగతి మాకు తెలియదు. అధికారులు ఎవరూ వచ్చి చెప్పడం లేదు . ఏళ్లుగా సాగు నీరు లేక మా భూములు పడావుగా ఉన్నాయి. ఈ పథకంతో సాగు చేసుకుందామనుకుంటే ఎట్లా దరఖాస్తు చేసుకోవాలో తెలియదు. సార్లు చెప్పితే దరఖాస్తు చేసుకుంటాం.

– ధరావత్ కల్యాణ్, దేవునిగుట్ట తండా

న్యూస్‌రీల్

గాయపడ్డ ఆశాకార్యకర్తలకు పరామర్శ



ఆశ కార్యకర్తలను పరామర్శిస్తున్న వైద్యాధికారులు

ఇల్లంతకుంట(మానకొండూర్): లెప్రసీ సర్వే విధులు ముగించుకొని ఆటోలో ఇంటికొస్తుండగా ప్రమాదబారిన పడ్డ ముగ్గురు ఆశ కార్యకర్తలను వైద్యాధికారులు ఆదివారం పరామర్శించారు. రహీంఖాన్‌పేట హెల్త్ సబ్‌సెంటర్ పరిధిలోని ఆశకార్యకర్తలు మచ్చ పద్మ, బట్టి తార, దొంతి ఎల్లవ్వ వెల్జీపురంలో లెప్రసీ సర్వే కోసం శనివారం వెళ్లి తిరిగి వస్తుండగా ఎర్రన్నపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. చేయి విరిగి ఇంటి వద్దనే ఉన్న మచ్చ పద్మను, దొంతి ఎల్లవ్వను, బట్టి తారలను స్థానిక వైద్యాధికారి జీవనజ్యోతి, హెచ్ఈవో వెంకటరమణ, సూపర్‌వైజర్ శోభ, ఏఎన్ఎం స్వరూప పరామర్శించారు.

కురుమ హాస్టల్‌కు స్థలం కేటాయించాలి



మంత్రి పొన్నంకు వినతిపత్రం ఇస్తున్న కనకయ్య, తదితరులు

బోయినపల్లి(చొప్పదండి): జిల్లా కేంద్రంలో కురుమ హాస్టల్, కురుమసంఘం భవనాల నిర్మాణాలకు ఐదెకరాలు కేటాయించాలని జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, నాయకులు సంబ లక్ష్మీరాజం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు. కురుమ, గొల్ల సామాజికవర్గాలు ఒకటి కాదని నిర్ధారణ చేసేందుకు ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు.

పాస్టర్ ప్రవీణ్‌ను హత్య చేసిన వారిని శిక్షించాలి



సిరిసిల్ల అంబేడ్కర్ వద్ద క్రైస్తవుల నిరసన

సిరిసిల్ల: ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో హత్యకు గురైన పాస్టర్ పగడాల ప్రవీణ్ హంతకులను శిక్షించాలని కోరుతూ సిరిసిల్లలో పాస్టర్లు ఆదివారం ర్యాలీ తీశారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. మాలమహానాడు రాష్ట్ర నాయకుడు రాగుల రాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేశ్, పాస్టర్లు మనోహర్, గోవర్ధన్, మోసే, శ్యామ్యూల్, ఏసుదాసు, ప్రేమ్ పాల్గొన్నారు.

వస్త్ర పరిశ్రమపై కక్ష సాధిస్తున్నారు



మాట్లాడుతున్న వస్త్రపరిశ్రమ జేఏసీ ప్రతినిధులు

- వస్త్రపరిశ్రమ జేఏసీ ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: సంక్షోభాన్ని అధిగమించే దశలో ఉన్న సిరిసిల్ల వస్త్రపరిశ్రమపై సెస్ పాలకవర్గం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని పరిశ్రమ, అనుబంధ రంగాల జేఏసీ ప్రతినిధులు కోరారు. సిరిసిల్ల చేనేత, వస్త్రవ్యాపార సంఘం భవనంలో ఆదివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రాజకీయ కక్షసాధింపులో భాగంగా నాలుగు రోజులుగా బ్యాక్‌బిల్లింగ్ సాకుతో పట్టణంలో 250 విద్యుత్ కనెక్షన్లు తొలగించారన్నారు. సెస్ మనుగడ వస్త్ర పరిశ్రమపై ఉందన్న విషయాన్ని విస్మరించొద్దన్నారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ సబ్సిడీ బిల్లులు రూ.60కోట్లకు పైగా ఉన్నా ఏనాడూ ప్రభుత్వాన్ని సెస్ పాలకవర్గం అడుగలేదన్నారు. ఇప్పటికైనా సెస్ పాలకవర్గం తమ పద్ధతి మార్చుకోవాలని లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జేఏసీ ముఖ్య నాయకులు తాటిపాముల దామోదర్, పంతం రవి, ఆడెపు భాస్కర్, ఆంకారపు రవి, గౌడ రాజు, బండారి అశోక్, ఏనుగుల ఎల్లప్ప, దూడం శంకర్, గోవిందు రవి, సామల అశోక్, మండల బాలరాజు పాల్గొన్నారు.

వృద్ధుడిపై కుక్క దాడి

ముస్తాబాద్: పోతుగల్‌కు చెందిన చిన్నాజీపై ఆదివారం కుక్క దాడి చేసింది. గాయపడ్డ చిన్నాజీని పీహెచ్‌సీకి తరలించారు. నెల రోజుల్లోనే చిన్నాజీపై రెండుసార్లు కుక్క దాడి చేసింది.

గుండారంలో తాగునీటి తండ్లాట

- రోడ్డెక్కిన తండావాసులు



రోడ్డెక్కిన పోచమ్మతండావాసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని ప్రజాపాలన పైలట్ గ్రామం గుండారం గ్రామపంచాయతీలో తాగునీటి తండ్లాట మొదలైంది. ఉగాది పండుగ రోజు నీళ్లు లేకపోవడంతో పోచమ్మ తండావాసులు డ్రమ్ములు, బకెట్లు, బిందెలు రోడ్డుకు అడ్డంగా పెట్టి నిరసన తెలిపారు. తమ తండాలో 15 రోజులుగా సుమారు 16 ఇండ్లకు తాగునీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గ్రామపంచాయతీ కార్యదర్శి దేవరాజును వివరణ కోరగా కొన్ని రోజులుగా ఆ తండాలో తాగునీటి ఇబ్బంది ఉందన్నారు. అందు కోసం మిషన్ భగీరథ నీటికి ప్రత్యామ్నాయంగా ట్యాంకర్‌తో నీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. సమస్య గురించి తెలుసుకొని ట్యాంకర్‌తో నీళ్లను అందిస్తామన్నారు. ట్యాంకర్‌తో నీళ్లను అందించకుండా శాశ్వత పరిష్కారం చూపాలని తండావాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరి నిరసనకు బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొదావత్ రవీందర్ నాయక్ మద్దతు తెలిపారు. మూడు రోజుల్లోగా నీటి సమస్య పరిష్కరించకపోతే మండల పరిషత్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

గుడి.. బడిని మరిచారు

- పరిహారం రాక అద్దె భవనంలోనే స్కూల్
- అద్దె చెల్లిస్తున్న మాజీ ప్రజాప్రతినిధి
- మిడ్‌మానేరు ముంపు గ్రామంలో అద్దె భవనంలోనే స్కూల్
- పక్కా భవనం లేక ఇబ్బందులు



ఆరెపల్లిలో ముంపునకు గురైన పాఠశాల భవనం



ఆరెపల్లిలో స్కూల్ కొనసాగుతున్న అద్దె భవనం

వేములవాడఅర్బన్: మిడ్‌మానేరు ముంపు గ్రామాల్లో నిర్వాసితులకు పరిహారం అందించినా అధికారులు.. గుడి, బడిని మరిచారు. మధ్యమానేరు నిర్వాసిత గ్రామం వేములవాడ మండలం ఆరెపల్లిలోని గృహాలతోపాటు ప్రభుత్వ పాఠశాల ముంపునకు గురైంది. అప్పటి అధికారులు పాఠశాలకు నోటిఫికేషన్ అవార్డు చేశారు. కానీ పరిహారం అందలేదు. ఆర్అండ్ఆర్ కాలనీలో పాఠశాలకు పక్కా భవనం నిర్మించలేదు. బడికి, గుడికి పరిహారం అందక పక్కా భవనాలు కరువయ్యాయి.

అద్దె చెల్లిస్తున్న మాజీ ప్రజాప్రతినిధి

గ్రామంలో పాఠశాల మూతబడితే మళ్లీ తెరుచుకోదనే ఉద్దేశంతో మాజీ సర్పంచ్ ఇటుకల నవీన రాజు అద్దె ఇంటిని తీసుకున్నారు. స్కూల్ నిర్వహణకు ఇంటి అద్దెను మాజీ సర్పంచ్ ఆరేళ్లుగా భరిస్తున్నారు. ప్రతీ నెల రూ.2వేల చొప్పున గత ఆరేళ్లుగా చెల్లిస్తూ స్కూల్ నిర్వహణకు సహకరిస్తున్నారు. ముంపునకు గురైన ప్రభుత్వ పాఠశాలకు పరిహారం అందించి, అన్ని హంగులతో నూతన భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వేములవాడ మండలంలోని మిడ్‌మానేరు ముంపు గ్రామాలైన సంకెపల్లి, అనుపురం, కొడుముంజ, రుద్రవరం, చింతల్‌ఠాణా, చీర్లవంచ, శాభాష్‌పల్లి గ్రామాల్లో ముంపునకు గురైన పాఠశాలల స్థానంలో నూతనంగా స్కూల్ భవనాలు నిర్మించారు. కానీ ఆరెపల్లిలో మాత్రం స్కూల్ భవనం గురించి పట్టించుకోవడం లేదు.

ఆలయాలకు పరిహారం అందలేదు

ఆరెపల్లి గ్రామంలోని శ్రీహనుమాన్ ఆలయం, పోచమ్మ ఆలయం ముంపునకు గురైంది. అప్పటి అధికారులు నోటిఫికేషన్ అవార్డు చేసి వదిలేశారు. నష్టపరిహారం మాత్రం అందించలేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అప్పటి ప్రభుత్వంలో గ్రామస్తులు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని గ్రామస్తులు చందాలు వేసుకొని హనుమాన్, పోచమ్మ ఆలయాలు నిర్మించుకున్నారు. ఇప్పటికైనా ఆ ఆలయాల పరిహారం అందిస్తే ప్రస్తుత ఆలయాలను మరింత అభివృద్ధి చేసుకుంటామని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

పాఠశాల భవనం నిర్మించాలి



ఆరెపల్లిలో ప్రభుత్వ పాఠశాల ముంపునకు గురైంది. ప్రస్తుతం అద్దె గదిలో నడుస్తోంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని ముంపునకు గురైన పాఠశాలకు పరిహారం అందించి, స్థలం కేటాయించి నూతన భవనం నిర్మించాలి.

– సిలివేణి ప్రశాంత్, ఆరెపల్లి

ఆలయాల పరిహారం అందించాలి



ఆరెపల్లిలో ముంపునకు గురైన హనుమాన్, పోచమ్మ ఆలయాల పరిహారం అందించాలి. పరిహారం అందిస్తే కొత్తగా ఆలయాలు నిర్మించుకుంటాం.

– ఎస్.అరవింద్, ఆరెపల్లి

క్లుప్తంగా

ఆటో, బైక్ ఢీ

- రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం




ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని హరిదాస్‌నగర్ శివారులో ఆటో, బైక్ ఢీకొన్న సంఘటనలో ఆరుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు యువకుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాలు. రంజాన్ పండుగకు కొత్త బట్టలు కొనుక్కునేందుకు ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌కు చెందిన ఇద్దరు యువకులు హఫీస్, అఫ్రోజ్ ఆదివారం సాయంత్రం బైక్‌పై సిరిసిల్లకు బయలుదేరారు. మండలంలోని హరిదాస్‌నగర్ శివారుకు చేరుకోగానే సిరిసిల్ల వైపు నుంచి వస్తున్న ఆటో, బైక్ ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు, ఆటోలోని నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు 108 వాహనంలో మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి యువకుల పరి స్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఆటోలో ప్ర యాణిస్తున్న హరిదాస్‌నగర్‌కు చెందిన రఘుపతి, ఎల్లేశం, గురువయ్య, జంపయ్యలు గాయపడ్డారు.

చిన్నారి మృతదేహం లభ్యం


దాస్ గెల్వి(ఫైల్)

రామగిరి(మంథని): ఎస్సారెస్పీ డీ–83 కాలువలో పడి గల్లంతైన దాస్ గెల్వి(2) మృతదేహాన్ని పోలీసులు ఆదివారం వెలికితీశారు. కల్వచర్ల శివారులోని ఎస్‌బీకే ఇటుక బట్టీలో పనిచేస్తున్న దాస్ సుజిత – సాగర్ దంపతుల కుమార్తె దాస్ గెల్వి(2) శనివారం ప్రమాదవశాత్తు కాలువలో పడి గల్లంతయ్యింది. దీంతో ఎస్సై చంద్రకుమార్, దివ్య ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఆదివారం మృతదేహం లభ్యమైంది. అనంతరం మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇటుక బట్టీల్లో అల్లారుముద్దుగా తిరుగుతున్న చిన్నారి విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, కార్మికులు విషాదంలో మునిగారు.

అగ్ని ప్రమాదంలో రూ.2.50 లక్షల ఆస్తి నష్టం


అగ్ని ప్రమాదంలో దగ్ధమైన సామగ్రి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన బేతి లక్ష్మారెడ్డి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. లక్ష్మారెడ్డి ఇంట్లో ఆల్ ఆవుట్ పెట్టి డోర్లు మూసి బయటకు వెళ్లారు. తిరిగి వచ్చే సరికి ఆల్ ఆవుట్ ప్లగ్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో ఉన్న బట్టలతో పాటు నిత్యావసర సామగ్రి బియ్యం, నువ్వులు, రూ.60వేల పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు విద్యుత్ సరఫరా నిలిపివేసి మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.2.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

రాజన్న ఆలయ అర్చకుడికి ఉగాది పురస్కారం


పురస్కారం అందుకున్న రాజన్న ఆలయ ఉప ప్రధాన అర్చకుడు కటుకూరి వెంకన్న

వేములవాడ: విశ్వావసు నామ సంవత్సరం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం పలు ఆలయాల అర్చకులకు ఉగాది పురస్కారాలు అందజేసింది. రాజన్న ఆలయ ఉపప్రధాన అర్చకుడు కటుకూరి వెంకన్న, వేదపారాయణదారు జగన్మోహన్‌లకు రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్, దేవాదాయశాఖ కమిషనర్ శ్రీధర్ శాలువతో సత్కరించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వారిపై కేసు

పాలకుర్తి(రామగుండం): ముంజంపల్లి గ్రామశివారులో ఇసుకను అక్రమంగా నిల్వచేస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామి తెలిపారు. గోదావరి నదీపరీవాహక ప్రాంతాల నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తీసుకువచ్చి ఎండపల్లి మండలం ముంజంపల్లి శివారులో నిల్వ చేస్తున్నారు. రాత్రి వేళల్లో లారీల ద్వారా హైదరాబాద్, జగిత్యాల జిల్లాల్లోకి తరలించి విక్రయిస్తున్నారు. ఈమేరకు అందిన సమాచారంతో పోలీసులు ఇసుక స్థావరాలపై దాడిచేశారు. జేసీబీ, రెండు టిప్పర్లను సీజ్ చేశారు. ఈదందా నిర్వహిస్తున్న బుర్రి మహిపాల్, ముంజాల సురేశ్, తనుగుల తిరుపతి, తనుగుల సురేశ్, వాసం సతీశ్‌తో పాటు గుమ్ముల రాజేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

మామిడి కొనుగోళ్లపై అనిశ్చితి

- ఓపెన్ మార్కెటా..? కమీషన్ మార్కెటా..?
- అయోమయంలో మార్కెట్ అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు, వ్యాపారులు

జగిత్యాలఅగ్రికల్చర్: మామిడి కొనుగోలు సీజన్ త్వరలోనే ప్రారంభంకానుంది. ఈ క్రమంలో జగిత్యాల (చల్‌గల్)లోని మామిడి మార్కెట్‌లో మామిడి కొనుగోళ్లు ఎలా చేపట్టాలనే అంశంపై అనిశ్చితి నెలకొంది. వ్యాపారుల్లో ఓవర్గం ఓపెన్ (బహిరంగ వేలం) పద్ధతిలో కొనుగోళ్లు చేపట్టాలని చూస్తుండగా.. మరోవర్గం కమీషన్ ప్రతిపాదికన చేయాలని భావిస్తున్నారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ఏ నిర్ణయం తీసుకుంటే ఏమవుతుందోనని మార్కెట్ అధికారులు సతమతం అవుతూ తాత్సారం చేస్తున్నారు.

జూన్ వరకు కొనుగోళ్లు

జగిత్యాల మామిడి మార్కెట్‌లో కొనుగోలు చేసిన బంగినపల్లి, దశేరీ, హిమాయత్ తదితర రకాల మామిడి కాయలు నాణ్యతగా ఉంటాయనే పేరుంది. ఇక్కడి కాయలకు ఢిల్లీ, నాగ్‌పూర్, చండీఘర్, హర్యానా, పంజాబ్, జమ్మూ, కాశ్మీర్, బంగ్లాదేశ్, దుబాయ్ వంటి దేశాల్లో మంచి డిమాండ్ ఉంది. దీంతో ఆయా ప్రాంతాల వ్యాపారులు మామిడి సీజన్ రాగానే ఈ ప్రాంతంపై వాలుతుంటారు. మామిడి మార్కెట్ సీజన్ ఏప్రిల్ రెండో వారంలో ప్రారంభమై.. జూన్ మొదటి వారం వరకు ఉంటుంది. మామిడి మార్కెట్‌లో ఓ పద్ధతంటూ లేకపోవడంతో గతేడాది కొందరు వ్యాపారులు ఓపెన్‌మార్కెట్‌లో కొనుగోలు చేశారు. మరికొందరు కమీషన్ పద్ధతిలో కొన్నారు. ఈ సీజన్‌లో ఏ పద్ధతిలో కొనుగోలు చేస్తారనే విషయంపై స్పష్టత లేకపోవడంతో వ్యాపారులు, అధికారులు, రైతుల్లో అయోమయం నెలకొంది.

కమీషన్ పద్ధతిలో ఇలా..

మామిడి కొనుగోలుకు మార్కెట్ కమిటీ నుంచి వ్యాపారులు లైసెన్స్ తీసుకుంటారు. మార్కెట్‌లో షెడ్లు ఏర్పాటు చేసుకుని షెడ్లకు వచ్చిన కాయలను బట్టి ఎవరికి వారే కొనుగోలు చేస్తుంటారు. రైతులు తోటలోని నాలుగైదు కాయలను శాంపిల్‌గా తీసుకొచ్చి వ్యాపారులకు చూపిస్తుంటారు. వ్యాపారులు ఆ కాయల నాణ్యత, పరిమాణం బట్టి ధర నిర్ణయిస్తుంటారు. వ్యాపారులు చెప్పిన రేటు నచ్చితే రైతులు కాయలను తెంపుకొని వచ్చి విక్రయిస్తుంటారు. ఈ పద్ధతిలో రైతులకు అన్యాయం జరుగుతుందని కొందరు వాదిస్తున్నారు. మామిడి శాంపిల్స్ తీసుకొచ్చిన సమయంలో ఓ రేటు.. మొత్తం కాయలు తీసుకొచ్చిన తర్వాత తిరకాసు పెట్టి రేటు తగ్గిస్తున్నారని, దీంతో రైతులు ఏమీ చేయలేక ఏదో ధరకు విక్రయించాల్సి వస్తుందని చెబుతున్నారు. అంతేకాకుండా సూట్, రాటన్, క్యాష్ కటింగ్ పేర రైతులను ఇష్టారీతిన దోచుకుంటున్నారని అంటున్నారు.


జగిత్యాలలోని మామిడి మార్కెట్

ఓపెన్ మార్కెట్‌లో ఇలా..

ఓపెన్ పద్ధతిలో కొనుగోళ్లు జరిపితే రైతులకు న్యాయం జరుగుతుందనేది మరికొందరి వాదన. ఈ పద్ధతిలో లోకల్ వ్యాపారులు కాకుండా ఢిల్లీ, నాగ్‌పూర్ వంటి ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పెద్ద ఎత్తున పాల్గొంటారు. తద్వారా వ్యాపారుల్లో పోటీ పెరిగి రైతులకు ఎక్కువ ధర వచ్చే అవకాశం ఉంది. ఓపెన్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన కాయలను వెంటనే ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయడం సాధ్యం కాదని, కాయలు చెడిపోతాయని చెబుతున్నారు. ఈ విధానంలో రైతుల నుంచి నాలుగు శాతం కమీషన్ కట్ చేయాల్సి ఉంటుంది. అలాగే ఓపెన్ పద్ధతిలో కొనుగోళ్లు సాగితే మార్కెట్‌కు భారీగా ఆదాయం వస్తుంది. ఓపెన్ మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి రేటు తగ్గించే అవకాశం కూడా ఉందని, తాము కొనుగోలు చేయమని మొండికేస్తే కాయలను ఎక్కడికి తీసుకెళ్లి అమ్ముకోవాలనే దానిపై రైతులు ఆందోళన ఉంది.

నిస్సహాయ స్థితిలో అధికారులు

మార్కెట్ నిబంధనల ప్రకారం మామిడి కొనుగోళ్లు ఓపెన్ పద్ధతిలో కొనుగోళ్లు చేపట్టాలి. కొందరు రైతులు, వ్యాపారులు ఓపెన్ మార్కెట్‌ను వ్యతిరేకిస్తుంటే.. మరికొందరు రైతులు, వ్యాపారులు కమీషన్ ప్రతిపాదిత మార్కెట్‌ను బలపరుస్తున్నారు. దీనికితోడు మార్కెట్ అధికారులు వ్యాపారులపై నిబంధనల ప్రకారం ఒత్తిడి తెస్తే రాజకీయ నాయకుల నుంచి ఫోన్లు, చీవాట్లు. దీంతో రైతులు, వ్యాపారులు, రాజకీయ నాయకుల మధ్య మార్కెట్ అధికారులు నలిగిపోతూ ఏమి చేయలేని నిస్సాహాయ స్థితిలో ఉండిపోయారు. మామిడి మార్కెట్‌లో కఠిన నిబంధనలు అమలు చేస్తేనే మామిడి మార్కెట్ ఓ దారికి వచ్చే అవకాశం ఉంది. ఎవరి ఇష్టారీతిన వారు వెళ్తుండడంతో చివరకు రైతులు బలవుతున్నారు. ఓ సమావేశం ఏర్పాటు చేసుకుని అందరితో చర్చించి, ఇతర పండ్ల మార్కెట్ల మాదిరిగా కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తే బాగుంటుందని రైతులు చెబుతున్నారు.


గత ఏడాది వ్యాపారులు కొనుగోలు చేసిన మామిడి కాయలు

నిబంధనలు అమలు చేయాలి



మామిడి మార్కెట్‌లో నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తేనే రైతులకు న్యాయం జరుగుతుంది. కొన్నేళ్లుగా కొనుగోళ్లు అస్తవ్యస్తంగా మారడంతో మార్కెట్‌కు రావాలంటేనే రైతులు భయపడే పరిస్థితి ఉంది. ఎవరి ఇష్టానుసారం వారు కొనుగోళ్లు చేస్తూ చివరకు రైతులను బలిపశువును చేస్తున్నారు.

– కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి, మామిడి రైతు, మేడిపల్లి

అమలు చేస్తాం



మామిడి మార్కెట్‌లో నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తాం. మామిడి మార్కెట్‌పై పూర్తి స్థాయిలో చర్చించేందుకు వ్యాపారులు, రైతులు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటాం. రైతులకు ఎట్టి పరిస్థితిలో అన్యాయం జరుగకుండా చూస్తాం.

– ప్రకాశ్, జిల్లా మార్కెట్ అధికారి

ఈద్ ముబారక్

- నేడు ఈద్ ఉల్‌– ఫితర్

కరీంనగర్‌కల్చరల్: ఆధ్యాత్మిక చింతన, నైతిక విలువ పెంచే పండుగ రంజాన్. ఈ పవిత్రమైన పండుగ కోసం ముస్లింలు నెలరోజుల పాటు ఉపవాస దీక్ష చేశారు. ఆదివారం రాత్రి నెలవంక దర్శనం ఇవ్వడంతో సోమవారం రంజాన్ పండుగ జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధం అవుతున్నారు. షాబాన్ మాసంలో నెలవంక దర్శనం అనంతరం ఉపవాస దీక్షలు ప్రారంభించి, దైవకటాక్షం కోసం పరితపిస్తారు. ఉదయం సహర్, సాయంత్రం ఇఫ్తార్ విందులు రంజాన్ నెలలో ప్రత్యేకత. దానధర్మాలు, స్వచ్ఛమైన జీవన విధానాన్ని అలవరుచుకునేందుకు ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని అనువైన సందర్భంగా భావిస్తారు. మోక్షానికి యోగ్యమైన మానవ జన్మను ప్రసాదించిన కారణంగా దేవుడికి సహృదయంతో కృతజ్ఞతలు చెప్పే అరుదైన పండుగ రంజాన్. పండుగ రోజు పుట్టినవారికి కూడా ఫిత్రా ఇవ్వాల్సి ఉంటుంది. ఫిత్రాల పేరు మీదనే ఈ పండుగను ఈద్ ఉల్ ఫితర్ అని పిలుస్తుంటారు. మార్కెట్లో రెండున్నర కిలోల గోధుమల ధర ఎంతో ఉందో అంత ఫిత్ర ఇవ్వాల్సి ఉంటుంది. జాకత్ ఫిత్రా దానాలు ప్రతీ ముస్లిం స్త్రీ, పురుషులకు విధిగా (వాజిబ్) నిర్ణయించబడ్డాయి. ముస్లింలు తమ సంపాదనలో 25వ వంతు దానం చేయడమే జకాత్. కాగా.. రంజాన్ ప్రార్థనలకు కరీంనగర్ జిల్లాకేంద్రంలో పురానీ ఈద్గాతోపాటు సాలేహ్‌నగర్, చింతకుంట, బైపాస తదిరత ప్రాంతాల్లో గల ఈద్గాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు.



గ్రూప్‌–1లో మెరిసిన జిల్లావాసులు

- ఎస్సీ కోటాలో హారిణికి మొదటి ర్యాంకు

కరీంనగర్: టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్‌–1 ఫలితాల్లో కరీంనగర్‌కు చెందిన కన్నం హరిణి రాష్ట్ర స్థాయిలో 55వ ర్యాంక్ సాధించింది. ఎస్సీ కమ్యూనిటీలో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకు సాధించింది. కరీంనగర్ విద్యానగర్‌లో నివాసం ఉంటున్న కన్నం రమేశ్ రామడుగు మండలం వెలిచాల జెడ్పీహెచ్ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు. భార్య కళాప్రపూర్ణ జ్యోతి రామడుగు జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయురాలు. వీరిది సొంతూరు బోయినపల్లి మండలం అనంతపల్లి. వీరి కూతురు గ్రూప్‌–1 పరీక్ష రాయగా ఆదివారం వెలువడిన ఫలితాల్లో జోన్‌–1లో డిప్యూటీ కలెక్టర్ పోస్టు పొందేందుకు అర్హత సాధించింది. హరిణిని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, బీటీఎఫ్ నాయకులు కొమ్ము రమేశ్, మానుపాటి రాజన్న, చిలుక దేవశంకర్, బెజగం రమేశ్, మానుపాటి రాజయ్య, మేకల స్వరూప అభినందించారు.


తల్లిదండ్రులతో కన్నం హరిణి

సివిల్స్ సాధించడమే లక్ష్యం


భూషిత్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: గ్రూప్‌–1 ఫలితాల్లో పెద్దపల్లి పట్టణానికి చెందిన పొందుగుల భూషిత్‌రెడ్డి 76వ ర్యాంకు ను సాధించారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన పొందుగుల విజయలక్ష్మి – భాస్కర్‌రెడ్డి దంపతుల కుమారుడు భూషిత్‌రెడ్డి.. సివిల్స్ సాధించాలన్న పట్టుదలతో ఉన్నారు. ఇప్పటికే రెండుసార్లు ప్రయత్నించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం బెంగళూరులో ఇన్‌కంట్యాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని దానిని సాధించేందుకు ఓ వైపు పనిచేస్తూనే మరోవైపు కఠోర దీక్షతో చదువుతున్నారని తల్లిదండ్రులు విజయలక్ష్మి, భాస్కర్‌రెడ్డి తెలిపారు.


తల్లిదండ్రులతో భూషిత్‌రెడ్డి

125వ ర్యాంక్


చిర్రం మహేశ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌కు చెందిన చిర్రం అంజయ్య–మల్లవ్వ దంపతుల రెండో కుమారుడు చిర్రం మహేశ్ గ్రూప్‌–1లో 125వ ర్యాంక్ సాధించాడు. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న మహేశ్.. ఉన్నత ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యాడు. రాష్ట్రస్థాయిలో 125వ ర్యాంక్ సాధించాడు.

ఏసీపీ కొడుక్కు 80వ ర్యాంకు..

- ఇప్పటికే అగ్రికల్చర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పాలకుర్తి సందీప్


పాలకుర్తి సందీప్

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ సీసీఎస్ ఏసీపీ పాలకుర్తి కాశయ్య కుమారుడు పాలకుర్తి సందీప్ గ్రూప్‌–1 ఫలితాల్లో 80వ ర్యాంకు సాధించాడు. కరీంనగర్‌లో ఇంటర్ వరకు చదివి, తమిళనాడులో అగ్రికల్చర్ బీఎస్సీ, రాజేంద్రనగర్‌లోని జయశంకర్ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేసిన సందీప్ అగ్రికల్చర్ ఆఫీసర్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ఏవోగా విధులు నిర్వహిస్తున్నాడు. ఉన్నత ఉద్యోగం సాధించాలనే తపనతో తల్లిదండ్రులు భాగ్యలక్ష్మి, కాశయ్య సూచనలు, ప్రోత్సాహంతో గ్రూప్‌–1 ఉద్యోగానికి ప్రిపేర్ అయి విడుదలైన ఫలితాల్లో 80 ర్యాంకు సాధించాడు. సందీప్ సోదరుడు సంజయ్ అమెరికాలో పీహెచ్‌డీ చేస్తుండగా.. సోదరి సింధు చెన్నైలో ఎంబీబీఎస్ హౌజ్ సర్జన్ చేస్తోంది. సందీప్‌కు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సురక్షితం.. సులభతరం

- విద్యుత్‌శాఖలో డిజిటల్ చెల్లింపులు
- సులభతరంగా ఆన్‌లైన్ చెల్లింపులు
- టీజీఎన్‌పీడీసీఎల్ యాప్ రూపొందించిన సంస్థ
- సమయం ఆదా.. ఎక్కడి నుంచైనా చెల్లించే అవకాశం

కొత్తపల్లి(కరీంనగర్): ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతిక పరిజ్ఞానం నూతన పుంతలు తొక్కుతోంది. ఆ సాంకేతికతను ప్రజలకు అందించేందుకు నిపుణులు విశేషంగా ప్రయత్నిస్తున్నారు. యూపీఐ, ఆన్‌లైన్ చెల్లింపులు సులభతరం అయ్యాయి. అందులో భాగంగానే విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ సంస్థ యాప్‌ను రూపొందించింది. వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు రెవెన్యూను సమకూర్చుకునేందుకు ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. బిల్లుల చెల్లింపులో సమయం వృథా కావొద్దనే ఉద్దేశంతో టీజీఎన్‌పీడీఎల్ యాప్‌ను రూపొందించింది. కొన్నేళ్లుగా ఈ యాప్ ప్రాచుర్యంలో ఉన్నప్పటికీ వినియోగదారులు ఆశించినస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం లేదు. ప్రస్తుతం యాప్‌ను విద్యుత్ సంస్థ మరింతగా అభివృద్ధి చేసింది. నెలవారి విద్యుత్ బిల్లులు యాప్ ద్వారా సురక్షింగా, సౌకర్యవంతంగా, సులభంగా చెల్లించవచ్చు.

ప్లే స్టోర్‌లో ఆండ్రాయిడ్ వర్షన్

యాప్‌ను ఆండ్రాయిడ్ వెర్షన్‌లో డెవలప్ చేసింది. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు కలిగిన వినియోగదారులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టీజీఎన్పీడీసీఎల్ యాప్‌లోకి వెళ్లి వినియోగదారుని యూనిక్ సర్వీస్ నంబర్ నమోదు చేసుకొని బిల్లు చెల్లించవచ్చు. ఈ విధంగా ప్రతి నెల జెనరేట్ అయ్యే బిల్లు తాలుకు సమాచారం ఆటోమేటిక్ వస్తుంది. ఇది ఇంట్లోనే ఉండి కేవలం రెండు నిమిషాల వ్యవధిలో చెల్లించవచ్చు. ఇప్పటి వరకు కరీంనగర్ సర్కిల్‌లో 1,27,339మంది ఈ యాప్‌ను వినియోగిస్తున్నారు. తద్వారా రూ.1327.84 లక్షల చెల్లింపులు ఆన్‌లైన్ ద్వారా జరిగాయి.

టీజీఎన్‌పీడీసీఎల్ లోగో

ఆన్‌లైన్ చెల్లింపులు చేయండి



వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించి సమయం ఆదా చేసుకోవాలి. మెరుగైన విద్యుత్ అందించేందుకు సంస్థకు సహకరించాలి. వేసవిలో బయటకు రాకుండా, క్యూలైన్‌లో నిలబడి సమయం వృథా చేసుకోకుండా ఇంటి వద్దే సురక్షితంగా యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించండి.

– మేక రమేశ్‌బాబు, ఎస్ఈ కరీంనగర్ సర్కిల్

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



వేములవాడ: రాజన్నను ఆదివారం ఉగాది సందర్భంగా దాదాపు 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల ఏర్పాట్లను ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో శ్రీనివాస్, శ్రవణ్, అశోక్, పర్యవేక్షకులు పరిశీలించారు.

వేములవాడ: హరిహర క్షేత్రంగా వెలుగొందుతున్న వేములవాడ రాజన్న సన్నిధిలో శ్రీసీతారామచంద్ర స్వామి నవరాత్రోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతం, ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 6న స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. ఈమేరకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్ ఆధ్వర్యంలో బారికేడ్ల పనులు చేస్తున్నారు. వసంత నవరాత్రోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి కోరారు.

ఇలాగైతే ఎలా..



మామిడిపల్లిలో పశువైద్యశాలలో కొనసాగుతున్న ఆరోగ్యకేంద్రం

కోనరావుపేట(వేములవాడ): భవనం ముందు ఉన్న ట్రేవిస్‌ను చూస్తే పశువుల ఆస్పత్రి అనుకుంటే పొరపడ్డట్టే. ఇక్కడ మనుషులకు వైద్యసేవలు అందిస్తున్నారు. పశువుల ఆస్పత్రిలో మనుషులకు వైద్యసేవలేంటి అనే అనుమానం కలగడం సహజమే. కానీ కోనరావుపేట మండలం మామిడిపల్లిలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం భవనంలో అన్ని సౌకర్యాలు పూర్తి కాకపోవడంతో గ్రామంలోని గోపాలమిత్ర భవనంలోనే వైద్యసేవలు అందిస్తున్నారు. అరకొర వసతుల మధ్య పశువుల ఆస్పత్రిలో మనుషులకు వైద్యసేవలు అందిస్తున్నారు.

ఆయిల్‌పామ్ వైపు మెట్ట రైతులు

- సాంప్రదాయ పంటలు వీడి నూతన సాగు
- రైతులకు కలిసొస్తున్న తోటలు


కాతకు వచ్చిన ఆయిల్‌పామ్ పంట


ఆయిల్‌పామ్ తోట

ఇల్లంతకుంట(మానకొండూర్): మెట్టప్రాంతం ఇల్లంతకుంట మండలంలోని రైతులు ఆయిల్‌పామ్ సాగుతో లాభాల బాట పడుతున్నారు. ఇన్నాళ్లు సాంప్రదాయ పంటలైన వరి, కూరగాయలు, పత్తి సాగు చేసిన రైతులు.. కొందరు కొత్తగా ఆయిల్‌పామ్ సాగు వైపు మళ్లారు. మండలంలోని ఇల్లంతకుంట, దాచారం, పెద్దలింగాపూర్, పొత్తూరు, గాలిపల్లి, వల్లంపట్ల, రేపాక గ్రామాల పరిధిలో 320 ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు.

ఎకరానికి 50 మొక్కలు

ఇల్లంతకుంట మండలంలోని దాదాపు 320 ఎకరాలలో ఆయిల్‌పామ్ తోటలు సాగు చేస్తున్నారు. ఒక ఎకరంలో 50 మొక్కలు నాటుతారు. ఒక మొక్క ధర రూ.193 ఉండగా రైతు చెల్లించేది రూ.20 మాత్రమే. 14 నెలల వయసు ఉన్న ఆయిల్‌పామ్ మొక్కలు రైతులకు ఉద్యానశాఖ అధికారులు సరఫరా చేస్తారు. మొక్క నాలుగేళ్ల వయస్సు వచ్చినప్పటి నుంచి దిగుబడి రావడం ప్రారంభమవుతుంది. మూడేళ్ల వరకు ఆయిల్‌పామ్ తోటలో అంతరపంటలు సాగు చేసుకునే అవకాశం కూడా ఉంది. పంట విత్తినప్పటి నుంచి నాలుగేళ్ల వరకు ఎరువుల కోసం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఎకరానికి ఏటా రూ.4,200 చెల్లిస్తారు. పంటకు డ్రిప్ సిస్టం ద్వారా సాగునీటిని అందించాల్సి ఉంటుంది. పంటకు డ్రిప్ పద్ధతి కోసం అవసరమైన పైపులను ఉద్యానశాఖ సబ్సిడీ రుణం మంజూరు చేస్తుంది. డ్రిప్ కోసం ఇచ్చే రుణంలో ఓసీలు, బీసీలకు 80 శాతం చొప్పున, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీ వర్తిస్తుంది. ఏడాది పొడగున నెలకోసారి పంట చేతికొస్తుంది. ఎకరానికి 8 టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ధర ఒక టన్నుకు రూ.20,800 ఉంటుందని ఇల్లంతకుంట మండల ఉద్యానశాఖ క్లస్టర్ ఆఫీసర్ వినయ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆయిల్‌పామ్‌ను అమ్ముకునే సౌలభ్యం ఉందని క్లస్టర్ అధికారి పేర్కొన్నారు. లాభసాటిగా ఉండడంతో రైతులు ఆయిల్‌పామ్ పంట వైపు మొగ్గు చూపుతున్నారు.

వరిసాగులో ఉన్నంత కష్టం లేదు



వరిసాగు కంటే ఆయిల్‌పామ్ సాగు సులభం. వరిసాగు కంటే తక్కువ నీరు అవసర పడుతుంది. సాగుచేసి నాలుగేళ్లు అవుతుంది. పంట రావడం ఇప్పుడిప్పుడే మొదలైంది. నా భర్త ప్రభుత్వ ఉద్యోగి. వరి సాగులో పడ్డంత కష్టం అవసరం లేదు.

– కదుదుల పద్మ, మహిళా రైతు, వల్లంపట్ల

ముందుకొస్తున్నారు



ఆయిల్‌పామ్ సాగులో ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఎక్కువగా ఉండడంతో రైతులు ముందుకొస్తున్నారు. మండలంలో 320 ఎకరాల్లో సాగవుతుంది. వరికి అవసరమైనంత నీరు ఆయిల్‌పామ్‌లో అవసరం లేదు. పని కూడా చాలా తక్కువగా ఉంటుంది.

– సురేశ్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి, ఇల్లంతకుంట

వాట్సాప్ పోస్టుతో బీఆర్‌ఎస్ నాయకుడిపై కేసు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా వాట్సాప్‌లో పోస్టు చేసిన బీఆర్ఎస్ నాయకుడిపై కేసు నమోదు చేసినట్లు తంగళ్లపల్లి ఎస్సై బి.రామ్మోహన్ ఆదివారం తెలిపారు. చిన్నలింగాపూర్ మాజీ ఎంపీటీసీ బైరినేని రామును కించపరిచేలా రామచంద్రాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొడ్డు శ్రీధర్ వాట్సాప్ గ్రూపులలో పోస్టు చేశారు. బైరినేని రాము ఫిర్యాదుతో శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌ను జిల్లా నాయకుడు బొల్లి రామ్మోహన్, మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నాయకులు పరామర్శించారు.


పోలీస్ స్టేషన్ వద్ద పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు